
నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 3 ఫిబ్రవరి 2024 | KAMAREDDY

వ్యాపారుల చేతుల్లో ఏటా మోసపోతున్న కర్షకులు

నీటి మూటలవుతున్న ఎంపీ అర్వింద్ మాటలు

ప్రతి సీజన్‌లోనూ కొరవడుతున్న కనీస మద్దతు ధర

మార్కెట్ కమిటీ అధికారులతో దళారుల కుమ్మక్కు



నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు రాక షురూ



# దళారుల మాయాజాలం

### ఉత్పత్తిలో మనమే టాప్..

దేశంలో దాదాపు పదికి పైగా రాష్ట్రాల్లో పసుపును సాగుచేస్తున్నారు. పంట ఉత్పత్తిలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. సుమారు 1.50లక్షల ఎకరాల్లో పసుపును పండిస్తున్నారు. నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్, నిర్మల్, మహబూబాబాద్ జిల్లాల్లో కలిపి మొత్తం 3.30 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతున్నది. పసుపు విక్రయాల్లో నిజామాబాద్ మార్కెట్ అతి పెద్దదిగా గుర్తింపు పొందింది. మన జిల్లాలోనే దాదాపుగా 30–40వేల ఎకరాల్లో పసుపును పండిస్తున్నారు. గతంలో 12 లక్షల క్వింటాళ్ల పంట ఇక్కడికి వచ్చేది. దిగుబడులు తగ్గడం, ధర లేకపోవడంతో సాగు విస్తీర్ణాన్ని కూడా తగ్గించారు. మహారాష్ట్రలో 2.62 లక్షల టన్నులు, కర్నాటకలో 1.30 లక్షలు, తమిళనాడులో 95.57 వేలు, ఆంధ్రప్రదేశ్‌లో 74.69 వేలు, మధ్యప్రదేశ్‌లో 68.85వేలు, పశ్చిమ బెంగాల్‌లో 45.90వేలు, ఒడిశాలో 43.64వేలు, మిజోరంలో 29.57 వేలు, అస్సాంలో 20.88 వేల టన్నుల పసుపును ఉత్పత్తి చేస్తున్నట్లుగా స్పైసెస్ బోర్డు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

### కొరవడిన పర్యవేక్షణ..

ఈ ఏడాది కూలీలు, ట్రాక్టర్ల కిరాయిలు, ఎరువుల ధరలు పెరడంతోపాటు పంటకు తెగుళ్లు సోకి దిగుబడిపై ప్రభావం చూపిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు దళారుల మాయాజాలంతో ధరలు పడిపోతున్నాయి. 12ఏండ్ల క్రితం నిజామాబాద్ మార్కెట్‌లో క్వింటా పసుపునకు రూ.15వేలు పలికిన సందర్భాలున్నాయి. కానీ, ఇప్పుడు కనీస మద్దతు ధర కూడా దక్కడంలేదు. కొందరు రైతులు ఇప్పటికీ పాత విధానంలోనే పసుపును సాగు చేస్తున్నారు. కొమ్ములను తవ్వి మార్కెట్‌కు తరలించే వరకు నెలరోజుల సమయం పడుతున్నది. ఎంతో జాగ్రత్త పడితే కానీ మేలురకం పంట చేతికి రాదు. ఎకరాకు సగటున 20 నుంచి 25 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుంది. వ్యయప్రయాసాలకోర్చి పసుపును మార్కెట్‌కు తీసుకువస్తే.. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతును నిలువునా ముంచుతున్నారు

నిజామాబాద్, ఫిబ్రవరి 2
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

పచ్చ బంగారం ధర రైతన్నలను ఆందోళనకు గురిచేస్తున్నది. దళారులు, వ్యాపారుల ఇష్టా రాజ్యంతో క్వింటాలు పసుపు ధర ఊగిసలాడుతున్నది. పెట్టుబడులు పెరుగుతున్నా ధర మాత్రం అలాగే ఉంటున్నది. దీంతో పసుపు రైతుకు కష్టాలే మిగులుతున్నాయి. 9 నెలల కాలంలో పసుపును పండించిన కర్షకుడు విక్ర య సమయానికి మార్కెట్ మాయాజాలానికి బలి పశువుగా మారుతున్నాడు. నిజామాబాద్ మార్కెట్ యార్డుకు పసుపు రాక మొదలైంది. మార్కెట్ కమిటీ అధికారులు, వ్యా పారుల జిమ్మిక్కులకు రైతు నిలువునా దోపిడీకి గురవుతున్నాడు. దీనికి తోడుగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాటలను నమ్మి కూడా మోసపోతున్నాడు. ఎవరో ఒకరికి వచ్చిన రూ.10వేల ధరను చూపడంతో రైతులు గందరగోళంలో పడుతున్నారు. ఎంపీ తీరుతోనూ కర్షకులు నష్టపోతున్నారు. ఏటా వేలాది మంది పంటను మార్కెట్‌కు తీసుకువస్తే.. ఒకరిద్దరికే గరిష్ఠ ధర దక్కుతున్నది. ఈ ఏడాది పరిస్థితులు ఎలా ఉంటాయోనని పసుపు రైతు దిగులు చెందుతున్నాడు.

**కలెక్టర్ దృష్టి పెడితేనే..**


నిజామాబాద్ మార్కెట్ యార్డుకు పసుపు రాక మొదలైన నేపథ్యంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు జనవరి 30న అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రైతు సంఘా లు, కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్స్‌తోపాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పాల్గొన్నారు. అయితే, మార్కెట్ కమిటీ బాధ్యుల తీరుపై లోతుగా సమీక్ష జరుగలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది భారీ వర్షాలతో పసుపు రైతులు తీవ్రంగా నష్టాలు చవిచూశారు. పసుపు రాక ముగిసిన వెంటనే ధర ఒక్కసారిగా రూ.11వేల నుంచి రూ.12వేలకు ఎగబాకింది. ఏటా ఇలా ధరలు పెరగడంపై అధికారులు దృష్టి పెట్టడంలేదు. ధర లేనప్పుడు రైతులు పంటను దాచుకునేలా కోల్డ్ స్టోరేజీలపై చర్చనే జరుగలేదు. మార్కెటింగ్ శాఖ అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం గమనార్హం. పసుపు ధర భారీగా పలుకుతున్నట్లు చూపిస్తున్నా.. రైతులకు సరాసరి రూ. 5వేలే దక్కుతున్నది. కలెక్టర్ చొరవ తీసుకుంటేనే దళారులు, వ్యాపారులు, మార్కెటింగ్ శాఖ అధికారుల దోపిడీని కట్టడి చేయవచ్చని రైతులు అంటున్నారు. సమీక్షలతో ఫలితం ఉండదని, మార్కెట్ యార్డుల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.

**ఓట్ల కోసమే రైతులను వాడుకుంటున్నరు..**



కొన్ని పార్టీల నాయకులు ఓట్ల కోసమే రైతులను వాడుకుంటున్నరు తప్పా.. మా సమస్యలను పట్టించుకుంటలేరు. పంటలకు గిట్టుబాటు ధర వస్తేనే రైతు బతుకుతడు. ఏండ్ల నుంచి మద్దతు ధర కోసం అడుగుతూనే ఉన్నాం. ఎన్నికల్లో మాత్రం హామీలు ఇస్తున్నరు. తర్వాత నాయకులు చేతుల దులుపుకొంటున్నరు. ఈ ఏడాది ఇప్పటివరకు మద్దతు ధర కల్పిస్తామని చెప్పిన వాళ్లేలేరు.

-సామ మహేందర్, వేల్పూర్



నిజామాబాద్ మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన పసుపు

## నేడు పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస పరీక్ష

వర్ని, ఫిబ్రవరి 2: వర్ని మండలం జాకోర సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డిపై సభ్యులు అవిశ్వాస తీర్మానం చేశారు. అందులో భాగంగా శనివారం డీసీవో శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సహకార సంఘం ఆవరణలో బలనిరూపణ పరీక్ష నిర్వహించనున్నారు. నిర్ణీత సమయానికి పాలకవర్గసభ్యులు సమావేశానికి హాజరుకావాలని అధికారులు కోరారు.

## కల్యాణలక్ష్మి.. పేద కుటుంబాలకు బాసట

**కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి**



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి

కామారెడ్డి/మాచారెడ్డి/దోమకొండ/ భిక్కనూరు/రాజంపేట్, ఫిబ్రవరి 2: ఆడబిడ్డలు ఉన్న పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి పథకం బాసటగా నిలుస్తున్నదని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి పట్టణంతోపాటు మాచారెడ్డి, రాజంపేట్, దోమకొండ, భిక్కనూరు మండలాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అడబిడ్డల పెండ్లి చేసే తల్లిదండ్రులకు ఈ పథకం ద్వారా ఆర్థికభారం తగ్గుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, మాచారెడ్డి తహసీల్దార్ శ్వేత, జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**దివ్యాంగులకు వాహనాలు..**

కామారెడ్డి, ఫిబ్రవరి 2 : జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులకు ఉపకరణాలు, త్రిచక్ర వాహనాలతో పాటు ఆర్థికసాయం అందజేశారు. వీటిని కామారెడ్డి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాటిపల్లి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి ప్రోత్సహిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి బాబయ్య, సీడీపీవో రోచిష్మ, ఫీల్డ్ రేంజ్ ఆఫీసర్ నరేశ్ పాల్గొన్నారు.

## జీపీ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

గాంధారి, ఫిబ్రవరి 2: గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పొతంగల్ కుర్దు గ్రామస్తులు కామారెడ్డి – బాన్సువాడ ప్రధాన రహదారిపై శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. జీపీ భవనం నిర్మిస్తున్న స్థలం తన పేరిట ఉన్నదని గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కిషన్‌రావు అంటున్నాడని, గ్రామ పంచాయతీ భవనం నిర్మించకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. ఆ స్థలాన్ని 1985లోనే గ్రామస్తులందరూ కలిసి కొనుగోలు చేశారని తెలిపారు. సుమారు గంటన్నరపాటు రాస్తారోకో చేయడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. కిషన్‌రావుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు అక్కడికి చేరుకొని గ్రామస్తులను సముదాయించి రాస్తారోకోను విరమింపజేశారు.

రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు



## బస్వాపూర్‌లో స్వల్ప ఉద్రిక్తత

**డబుల్ ఇండ్లను ఆక్రమించిన గ్రామస్తులు తిరిగి స్వాధీనం చేసుకున్న అధికారులు**

భిక్కనూరు,ఫిబ్రవరి 2: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను గ్రామస్తులు పలువురు గురువారం రాత్రి ఆక్రమించుకున్నారు. కొంతమంది సామగ్రితోపాటు ఇండ్లలోనికి చేరగా, మరికొందరు ఇండ్లకు తాళాలు వేశారు. 44వ జాతీయ రహదారి నుంచి పెద్దమల్లారెడ్డికి వెళ్లే దారిలో బస్వాపూర్, సిద్ధరామేశ్వర్ నగర్ గ్రామాల నిరుపేదల కోసం కేసీఆర్ ప్రభుత్వం 50 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించింది. గురువారం రాత్రి బస్వాపూర్ గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు డబుల్ బెడ్రూం ఇండ్ల వద్దకు చేరుకొని అక్రమంగా ప్రవేశించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శివప్రసాద్ శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకొని వారిని ఖాళీ చేయించారు. డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించక ముందే ప్రవేశాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇండ్లను ఆక్రమించిన వారిని ఖాళీ చేయించి తాళాలు వేయించారు. లబ్ధిదారులను త్వరలోనే ఎంపిక చేసి డబుల్ బెడ్రూం ఇండ్లను అందజేస్తామని చెప్పారు.



డబుల్ బెడ్రూం ఇంటికి తాళం వేసిన అధికారులు

## 5న డిచ్‌పల్లికి కేటీఆర్, కవిత రాక



డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని జీ కన్వెన్షన్‌లో ఈనెల 5న బీఆర్ఎస్ రూరల్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి నిర్వహించనున్నట్లు ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నారని పేర్కొన్నారు. పార్టీ నేతలకు టోల్‌ప్లాజా నుంచి భారీ ర్యాలీగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశానికి పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు

# రైతులను మోసం చేయొద్దు

**డీలర్లతో కామారెడ్డి కలెక్టర్ జితేశ్ పాటిల్**

కామారెడ్డి, ఫిబ్రవరి 2: అన్నంపెట్టే రైతన్నలను మోసం చేయొద్దని, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించే డీలర్లు వ్యవసాయ రంగంపై అవగాహన కలిగి ఉండాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. రైతులకు నాణ్యమైన, మేలు రకం విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, జాతీయ వ్యవసాయ విస్తరణ నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎల్లారెడ్డి డివిజన్‌లోని 40 మంది ఇన్‌పుట్ డీలర్లకు 48 వారాల పాటు నిర్వహించిన వ్యవసాయ విస్తరణ సేవ డిప్లమా కోర్సులో ఉత్తీర్ణులైన వారితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విక్రయదారులకు వ్యవసాయ రంగంపై అవగాహన కలిగి ఉన్నప్పుడే రైతులకు సరైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందిస్తూ మెలకువలు తెలుపుతారని అన్నారు. అనంతరం బంగారు, వెండి, రజత పతకాలు సాధించిన రవీందర్ రెడ్డి,సంతోష్,సాయిచరణ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రత్న భారతి, లక్ష్మీప్రసన్న, సునీతారాణి, హరీశ్ కుమార్, శ్రీకాంత్, అనిల్ కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఈవీఎంలపై అవగాహన అవసరం..**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఓటు వేసే విధానంపై ఓటర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ జితేశ్ పాటిల్ అన్నారు.కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని సందర్శించి బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల పనితీరును పరిశీలించి యంత్రాల నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఓటు వేయడంపై ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో డెమో ప్రదర్శిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ ప్రవీణ్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు అనిల్ కుమార్, ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

మాక్లూర్, ఫిబ్రవరి 2: ప్రత్యేకాధికారులుగా నియమితులైన ఆఫీసర్లు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. శుక్రవారం మాక్లూర్ ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో జైక్రాంతి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్పీ చైర్మన్ ప్రత్యేకాధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ షబ్బీర్, డీటీ పద్మలత, పశువైద్యాధికారిణి ఉమామసాహేర్, ఏపీవో ఓంకార్, అశోక్‌రావు, కోఆప్షన్‌సభ్యుడు హైమద్, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

## కండక్టర్‌పై ప్రయాణికుడి దాడి



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2 : మండలంలో ఆర్టీసీ బస్ కండక్టర్‌పై ప్రయాణికుడు శుక్రవారం దాడి చేశాడు. బాధిత కండక్టర్ రేయికుంట దేవదాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి నిజామాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సులో కుప్రియాల్ వద్ద ప్రయాణికుడు దొంతుల రవి బస్సు ఎక్కాడు. డిచ్‌పల్లి వరకు తీసుకున్న బస్‌పాస్ చూయించాడు. డిచ్‌పల్లి స్టేజ్ రాగానే కండక్టర్ అతడిని బస్సు దిగాలని కోరాడు. తాను ప్రతిరోజూ గాంధీనగర్ కాలనీ వరకు ఇదే బస్‌లో వెళ్తానని, అక్కడే దిగుతానని రవి బదులిచ్చాడు. పాస్ ఇక్కడి వరకే ఉందని, ఇక్కడి నుంచి టికెట్ తీసుకోవాల్సి ఉంటుందని కండక్టర్ చెప్పడంతో ఆగ్రహానికి గురైన రవి.. కండక్టర్‌ను దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నాడు. కండక్టర్ చేతిలోని టికెట్ మిషన్, క్యాష్‌బ్యాగ్‌ను లాక్కొని పొదల్లోకి విసిరివేశాడు. స్థానిక కంట్రోలర్ చందర్‌నాయక్ డిచ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించడంతో, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని రవిని అదుపులోకి తీసుకున్నారు. కండక్టర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

## పబ్లిక్ నోటీస్

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ యగు **బి.విక్రం రెడ్డి తండ్రి బి. గంగారెడ్డి** గారి పైన **బి.ప్రమోద్ రెడ్డి తండ్రి బి.గంగారెడ్డి గారు** బోధన్ సీనియర్ సివిల్ జడ్జి యందు, బాన్సువాడ లోని **బి.గంగారెడ్డి, బి.ప్రమోద్‌రెడ్డి మరియు బి.విక్రం రెడ్డి** గార్లకు చెందిన **" త్రివిక్రమ రైస్ మిల్ "** (Trivikrama Rice Mill) మరియు దాని పరిసర ప్రాంతాల మునిసిపల్ నెం.5–5–107, దాని యొక్క విస్తీర్ణం అందాజా7694 చదరపు గజాలు మరియు దాని యొక్క హద్దులు:

**తూర్పు:** 5–5–108 నెం. గల బి. విక్రం రెడ్డి గారి భవనం,
**పడమర:** ప్రభుత్వ ప్రైమరి పాఠశాల,
**ఉత్తరం:** గంగారెడ్డి మరియు వారి కుటుంబ సభ్యుల ఆస్థి,
**దక్షిణం:** పాత బాన్సువాడకు వెళ్ళే మున్సిపాలిటీ రోడ్డు.

పైన **O.S.No.24/2009** అను తప్పుడు కేసు వేయడం జరిగింది. అయితే ఈ కేసు యొక్క తుది తీర్పు నా క్లయింట్ అగు బి.విక్రం రెడ్డి గారికి అనుకూలంగా రావడం జరిగింది.తదానంతరం మళ్లీ ప్రమోద్ రెడ్డి గారు ఏడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు బోధన్ యందు **A.S.No.29/2014** అప్పిలు కేసు వేయడం జరిగింది. ఈ కేసులో కూడా జిల్లా కోర్టు తీర్పు నా క్లైంట్ అగు బి.విక్రం రెడ్డి గారికి అనుకూలంగా రావడం జరిగింది. పైన తెలిపిన ఆస్తికి **బి.ప్రమోద్ రెడ్డి** గారు ఒక్కరే యజమాని కాదు, పైన తెల్పిన ఆస్తి **బి.గంగారెడ్డి, బి.ప్రమోద్ రెడ్డి** మరియు **బి.విక్రం రెడ్డి** గార్ల ఆస్తి, కావున **త్రివిక్రమ రైస్ మిల్** (Trivikrama Rice Mill) మరియు దాని పరిసర ప్రాంతాలు ఎవరు కూడా కొనుగోలు చేయరాదు అని ఇందుములముగా తెలియజేస్తున్నాము. ఒకవేళ పైన తెలిపిన బాన్సువాడలోని **త్రివిక్రమ రైస్ మిల్** మరియు (Trivikrama Rice Mill) దాని పరిసర ప్రాంతాలు ఎవరైనా కొనుగోలు చేసిన అట్టి విక్రయం చట్టరీత్యా చెల్లదు. ఇందుకు వారే బాధ్యులు..

Sd/- **M.BHUSHAN REDDY**, Advocate, Enrolment No.121/1981
H.No.2-2-39/5/B, Beside Eidgah, Near Junior Civil Judge Court,
Main Road, Banswada - 503 187, Cell: 9440863011